# వెలుగు తుప్పర్లు

బడినిండా చిల్లపెంకుల్లా పిల్లలు.

పట్టించుకున్న వాళ్ళకి కనిపించినట్టూ, పట్టించుకోని వాళ్లకి కనిపించనట్టూ ఉన్న వాళ్ళజీవితాల్లాగే, కనిపించని అర్ధనగ్న మైన శరీరాలూ....

కేర్ ఫ్రీగా గాలికి పెరుగుతున్నట్టుగా ఉన్న వాళ్ళ జీవితాల్లాగే నెత్తిమీద పీచురేగిన జుత్తులూ....

బండబారిపోయి బండలపాలై పోయినట్టుగా ఉన్న వాళ్ళ జీవితాల్లాగే నిర్లిప్తంగా కదిలే వాళ్ళ కళ్ళూ....

....బడినిండా మెదుల్తున్నాయి.

బడికెందుకు రావాలో, ఎందుకు వస్తున్నారో, ఏమిటి చెయ్యాలో-ఎలా చేస్తున్నారో వాళ్ళకే తెలియదు.

అంటరానితనం నేరమని ఎన్ని ఏర్పాట్లు చేసినా రోడ్డు మీద ఎడంగా నిలబడి దప్పికడిగే వాళ్ళలాగే ఆ పట్టణంలో వాళ్ళ నివాసంకూడా అంటుకోకుండా దూరంగా ఉంది.

ఆ ప్రాంతానికి మున్సిపాలిటీకొక రిజర్వుడు సీటు ఉంది. వాళ్ళని అభివృద్ధిపరచడానికేమోమరి వాళ్ళ బ్రతుకుల మార్పుకోసం ఏర్పడిన ఓ చిన్న "సంఘం" కూడా వుంది.

ఔను....ఇంకెక్కడికైనా వెళ్తే దొరకదని, అసలు వీళ్ళను వెళ్ళనివ్వకుండా ఉంచాలని ఏర్పాటు చేసిన రాత్రంతా బొళ బొళమని పడే ఓ పెద్ద కొళాయికూడా వుంది. అద్గదో....అల్లాంటి ప్రాంతంలో, వాళ్ళ పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పమని ఓ బడి!

బడికి బడి అలాగే వుంటుంది. మున్సిపాలిటీవాళ్ళ పక్కా బిల్డింగు, చుట్టూ పెద్ద ప్రహరీ గోడ, పంకంలో పంకజంలాగా, సరస్సులో గోపురంలాగా, గాడిదగుడ్డులాగా సిమెంటు రేకుల షెడ్డు. చుట్టూ మొక్కలు వెయ్యని, మొక్కలు పెరగని తోట.

మొక్కలేని, మొక్కలు పెరగని తోటలో అరుదుగానూ అద్భుతంగానూ పూచే పువ్వుల్లాంటి, పూల మనసుల్లాంటి పిల్లలు. తోటలోకి విషపుటాలోచనల గాలులూ, దుర్మార్గపు బుద్ధుల పశువులూ ప్రవేశించకుండా చేతి కర్రతో కాపలా కాసే తోట మాలిలా మేస్టారు.

ప్రతినెలా జీతాలు సక్రమంగా అందితేనే నెలలో వారం రోజులు మాత్రం భోజనం చేసే మేస్టారికి మూడు నెలలుగా జీతాలు లేవు. లేకపోవడానికి కారణం గ్రాంట్సు రాక కాదు. జేబులోని సొమ్ము మేస్టర్లకి ఊరకనే ఇచ్చెయ్యాలని బాధపడే కమీషనర్ గారు దయచూపించకపోవడమే!

ఆయనకు మున్సిపల్ స్కూలంటే మంచి అభిప్రాయం లేదు. టీచర్లు ఏ మాత్రం పన్జెయ్యకుండానే నెలవారీ జీతాలకు ఎగబడుతుంటారని, జీతాలు రాబటుకోవడంలో ఉన్న శ్రద్ధ

పాఠాలు చెప్పడంలో లేదని ఆయన గట్టిగా చెప్పగలడు. అంచే తనే బడుల్లో కనీసం క్రమశిక్షణైనా నేర్పకపోవడం గర్హనీయమని స్థానిక మీటింగుల్లో ఆయన ప్రకటనలు చేస్తుంటాడు. అది చూసి "అహో! తన మున్సిపాలిటీ అని, తన క్రింద పనిజేస్తున్న వాళ్ళనైనా దురభిమానం లేని నిష్పక్షపాతి" అని ఎంతో మంది పొగుడుతూంటారు. అందుకని తన పిల్లల్ని ఆ వూళ్ళో మిషనరీ వారు నెలకొల్పిన భారీ ఎత్తు ఇంగ్లీషు మీడియం స్కూలుకి కారులో "ఆఫీసు బంట్రోతు"ను తోడిచ్చి పంపుతుంటాడు.

ఆరోజు వారు మీటింగును "కాల్ ఫర్ చేసేరు.

మున్సిపలాఫీసు పెళ్ళివారిల్లులా వుంది. వచ్చేపోయే ఖరీదైన వాళ్ళతో, రకరకాల ఏవగేషన్లతో బుర్రనిండిన పెళ్ళి పెద్దలా హడావుడిగా వున్నారు కమీషనరుగారు. భోజనాలైన పెళ్ళివారింట్లోనూ, ఇంటిచుట్టూరా మూగిన కాకుల మందలా ఉన్నారు-మీటింగుకై ఎదురుచూస్తున్న మాస్టర్లు.

"....బోధనలో న్యూ ఇవాల్యుయేషను స్కీము ప్రవేశపెట్టిన సంగతి మీ కందరికీ తెలుసును దీనిమీద యుంచుమించు ప్రతియేటా విద్యాశాఖ వారిచేత సెమినార్లు ఏర్పాటు చేయబడుతున్నాయ్. అయితే యిప్పటికీ ఆ యూనిట్ ప్లానులూ, లెసన్ ప్లానులూ తయారు చేసుకోవడం రాని ఉపాధ్యాయులున్నారని డిపార్టుమెంటు మన టీచర్సుని వేలెత్తిచూపడం నాకే చిన్నతనంగా

ఉంది. అంచేత ఇకనుండి కష్టపడి ఆ ప్రకారం బోధన జరపడం కనిపించకపోతే తీవ్రమైన చర్య తీసుకోవడానికి వెనుకంజ వేయం. ఈ విషయంలో మీకేమైనా సందేహాలుంటే మన స్కూల్స్ సూపర్వైజరుగారు నివృత్తి చేస్తారు," అంటూ ముగించేరు.

ఎప్పుడూ విన్న మాటలే. ఉన్నమాటలే. వినాల్సింది, ఉండాల్సింది జీతాలమాట. ఆ విషయం ఏమైనా ఆయన చెప్తారేమో, లేదా టీచర్లే కదపాల్సి ఉందేమోనని కొంతమంది టీచర్లు ప్రయత్నిస్తున్నారు. ఆర్థికంగా వెనకదన్ను ఉన్నవాళ్ళు ఎన్ని నెల్లు జీతాలివ్వకపోతే అంతా దాచుకున్నట్టే గదా అన్నంత ధీమాగా ఉన్నారు. ఎంతోసేపు ఉగ్గబట్టుకుని కూర్చున్న మాస్టారొహరు లేచి....

"ఆయ్....మూడు నెలలుగా జీతాల్లేక బాధపడుతున్నాం సార్....ఈ నెలైనా జీతాలమాటేవైనా తెలిస్తే...." అంటూ భీకరమైన మున్సిపల్ కమీషనరుగారి ముఖం చూసి నాన్చేసేరు.

పెళ్ళివారింట విందు జరుగుతూంటే ముష్టి కొచ్చినవాణ్ణి చూసిన పెళ్ళిపెద్దలా కయ్యని గెంతేరు కమీషనరుగారు.

"ఏ మాట ఎక్కడ మాటాడాలో తెలీనివాళ్ళు మీరు పిల్లలకేం నేర్పుతారయ్యా....మీలో క్రమశిక్షణ లేదు కాబట్టే భావి భారత పౌరులు కావలసినవాళ్ళలో అశాంతి చెలరేగుతున్నాది..." అంటూ ఇంకా ఇంకా అరుచునేమోగాని 'కట్నాల' విషయంలో

ఏదో - పేచీ వస్తే పెళ్ళి పెద్దని వియ్యంకులవారు కేకేసినట్టుగా మున్సిపల్ కంట్రాక్టరు కబురు పెడితే కమీషనరుగారు వెళ్ళిపోయేరు.

తర్వాత స్కూలు సూపర్‌వైజరుగారు చెప్పిందంతా కేసబియాంకాల్లా బుద్ధిమంతుల్లాగా ఆకలి కడుపులతోనే విన్నారు. తర్వాత ఈసురోమని లేచేరు.

ఈసురోమని బడికొచ్చిన మేష్టారు ఈదురు గాలికి రాలిన ఆకులా కుర్చీలో కూలబడిపోయేరు.

"బొత్తత జయిసూ ?...." (అన్నం తిన్నావా ?)

ఎక్కడనుండో చిన్నగా గొంతు వినిపిస్తూంటే తలెత్తి చూసేరు మేస్టారు. చివరి వరుసలో ఓ మూలగా కూర్చుని శరీరంలో క్రింది భాగానికి మాత్రమే అచ్ఛాదనడున్న గుడ్డలాంటి లాగూని మరింత కిందికి లాక్కుంటూ అడుగుతోంది పెంటమ్మ.

"అయినానీ....(లేదు)

పక్కనే కూర్చొని ఎటో చూస్తూ చెప్తోంది పోలి.

"కయినుకి కయినానీ.... ?" (ఎందుకు తినలేదూ.... ?)

"నందానో....మోబో బండి బొయుతూబా జేసీ ...మొమా బొంజు బితికే బాజేసీ.,." (వంటే చెయ్యలేదు. మా అయ్య రిక్షా తోలడానికి వెళ్ళిపోయేడు. మాయమ్మ పళ్ళమ్ముకోడానికి వెళ్ళిపోయింది.

"సోంజా డబ్బులు గితానుసుకివో(...(సాయంకాలం డబ్బులు తెస్తారే(వో)

"మోబో మెదుబీకిరి ఐసీ...తినసేక అత్తరలొయిసీ సుక్క మలనంద బొలిసీ...చోళోనీ...మచ్చకేటే? (మా అయ్య తాగేసి వొచ్చి సేడు.ముప్పావలా చేతిలో పెట్టి సేపల పులుసొండ మన్నాడు. బియ్యవేలేవు... సేప లెక్కడివి?)

"తిటబొక్క మొన్నోనీ..." (నీ కాక లెయ్యలేవేంటే మరి?)

"ఒడిలో రొట్టి బంటూసే...ఏదీ కయిపించూ...(బడిలో రొట్టి పంచేరు కదా, అది తినేసేను.)

ఎదిగిపోయిన బాధ్యత ఎదిగీ ఎదగని పోలిచేత వయసుకి మించిన మాటలాడించుతూంటే ఎన్నాళ్ళనుండో ఆ బడిలో పన్జేస్తూ వాళ్ళ భాష కలవాటయిన మేస్టారికి అర్థం అయీ కాన ట్టుగా వుంది.

ఎక్కడికి వెళ్ళినా ఆకలి మాటే, డబ్బు మాటే. మర్చి పోదామన్నా ఈ సమాజంలో ఏ మూల దాక్కున్నా ఇందుగల దందులేదని ప్రత్యక్షమయ్యే ఆర్థిక సమస్య మేస్టారికి చిరాకెత్తిం చింది. అంతవరకూ నెమ్మదిగా విన్న మేష్టారికి జులుం చెలా యిస్తున్న కమీషనరూ, మర్చిపోయిన ఆకలీ నీరసమూ జ్ఞాప కానికి వచ్చేయి. జ్ఞాపకం రాగానే మేస్టారి పళ్ళు అనుకోకుండా పటపటలాడేయి.

మొహం భయంకరంగా మారింది. వెటకారంగా "యే అమ్మి పోలె....యాకిరై...." అంటూ వచ్చీ రాని భాషలో పిలిచి..."ఏంటే బళ్ళో ఊపులు గుంటల్లారా. నోరు మూసు క్కూచో లేరేంటే..." అంటూ ఆకలి మార్పిన భాషలో కోప్పడి ఫెడీమని ఓ లెంపకాయా, గభీమని ఓ గుద్దూ గుద్దేరు.

వచ్చే ఏడుపునాపుకుని దీనమైన మొహం పెట్టడానికవేం వుత్తుత్తి దెబ్బలూ కావూ..సినిమా సీనూ కాదు అందుకే బావురుమంది. కళ్ళ నీళ్ళూ, ముక్కు చీవిడీ చేత్తోనే తుడిచేసుకుని బెక్కుంటూ వెళ్ళి కూర్చుంది.

అది చూసి ఏ న్యూ ఇవాల్యుయేషను స్కీము ఎలా ఇక్కడ ప్రవేశపెట్టేదిరా భగవంతుడా అని బెంగపడ్డారు మేస్టారు. కట్టుకుందికి గుడ్డా, తినడానికి తిండీ నోచుకోని అలాంటి వాళ్ళకి ఆకలికి అధికార ఏజెంటు లాంటి తనేం చెప్పాలో బోధపడలేదు మేస్టారికి.

ఎప్పుడు నాలుగున్నరైందో ఎప్పుడు పిల్లలంతా వెళ్ళిపోయారో గమనించనేలేదు మేస్టారు. గమనించే సరికి చీకట్లు పడుతున్నాయి. ఇంటికి వెళ్ళి ఆకలి కడుపుల్ని పరామర్శించడం తప్ప చేయాల్సిన పనేమీ లేదు మేస్టారికి. అంచేతనే ఆ బడి చూరుకిందనుండి నా లోకం వేరన్నట్టుగా చూస్తూ కూర్చుండిపోయేరు.

నల్లటి చీకటి గొడుగు తాలూకూ పురుక్కొట్టిన కన్నాల్లోంచి కారుతూన్న వెలుతురు చినుకుల్లా ఆకాశంనిండా చుక్కలు

ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పేరు తెలియని రాక్షసుడెవరో సూర్యుణ్ణి, చంద్రుణ్ణీ ఇంకేవేవో వెలుగు ముద్దల్ని నమిలేసి, ఉమ్మేసిన తుప్పర్లలా ఊళ్ళోని దీపాలు మినుకు మినుకు మంటున్నాయి. ఊళ్లో అంటరాని ఆ ప్రాంతంతోపాటు అంటరానట్టుగా కూర్చున్నారు మేస్టారు.

చూస్తూంటే చీకటి కొండచిలవ పూర్తిగా మింగేసిన వాడిలా ఉన్నారాయన. బాల్యం నుండి ఆనాటివరకూ సంతోషాన్నంతా కండెన్స్ చేసి దాచుకున్న మనసుని-గుడినీ గుళ్ళో లింగాన్నీ మింగేయగలిగిన కమీషనరు లాంటి వాడెవడో నంజుకున్నట్టున్నాడు. అంచేత ఒళ్ళు చచ్చిపోయి, మనసు పుచ్చిపోయినవాళ్ళా కూడా ఉన్నాడాయన.

పుచ్చిపోయిన దూలం నుండి ఖణిల్మని బంగారు నాణేలు రాలినట్టు పోలీ, వెంటమ్మా బళ్ళో దూరేరు. ఆ శబ్దానికి తిరిగి చూసి "ఏంటి" అన్నారు మేస్టారు.

"మేస్టారండీ ...మాయమ్మ పళ్ళమ్ముతాది గదా. సాయంకాలం వేళొచ్చి ఒంటనేదని నా నింటానికి నాల్గు పళ్ళిచ్చినాదండి. నువ్వు మజ్జిన వణ్ణం తిన్లేదు గదండీ, అందుకని రెండు పళ్ళు పట్టుకొచ్చినానండి ..." అంటూ మసి బొగ్గులాంటి చేతుల్తో మాణిక్యాల్లాంటి బత్తాయిపళ్ళు అందించింది పోలి.

పోలి, వెంటమ్మా లాంటివాళ్లు... రాక్షసులు నమిలి ఉమ్మేసిన వెలుగు తుప్పర్లయితేనేం....తుప్పర తుప్పరా కలిసి ఉప్పెనై ఈ సమాజాన్ని క్షాళన చేస్తారు. చెయ్యాలని ఆ క్షణంలో మేస్టారు ఆశించేరు. ★